ఖరీఫ్ సాగు మరింత జాప్యం

- నీటి విడుదల ఆలస్యంతో ఇబ్బందులు
- ఖరీఫ్ సాగు.. ముందస్తుకు దూరం
- కాలువల్లో కొనసాగుతోన్న వేసవి పనులు



వెంకయ్య వయ్యేరు పంట కాలువ

ఆకివీడు: ఖరీఫ్ సాగు వెనుకంజ వేయనుంది. ముందస్తు సాగుకు మరింత దూరం కానుంది. ఈ ఏడాది వేసవి అనంతరం పంట కాలువలకు నీరు వదిలే ప్రక్రియ వెనుకడుగు వేస్తోంది. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు నీరు వదలాల్సి ఉండగా జూన్ 15వ తేదీ దాటిన తరువాత నీరు వదిలే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కాలువల మెయింటినెన్స్ పనుల మంజూరులో జాప్యం వలన ఈ పరిస్థితి ఏర్పడింది. ఫేజ్–1, ఫేజ్–2, ఫేజ్–3గా పనుల మంజూరు విధానం కొనసాగుతోంది. ఫేజ్–3 పనులు మంజూరు నేటికీ ఖరారు కాలేదు. దీంతో మొదటి రెండు ఫేజ్‌లలో పనులు నత్తనడకగా కొనసాగుతోండటంతో గోదావరి నుంచి పంట కాలువలకు నీటి విడుదల జాప్యం అయ్యే అవకాశాలు అధికంగా కన్పిస్తున్నాయి. నేటికీ నీటి పారుదల శాఖ, జిల్లా యంత్రాంగం సాగు నీటి విధానంపై, పంట కాలువలకు నీటిని విడుదల చేసే తేదీని ఖరారు చేయలేదు. దీంతో సాగు నీరు ఎప్పుడు విడుదల అవుతుందోనని రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

పంట కాలువల్లో పూడిక తీత

పశ్చిమ డివిజన్‌లోని పలు పంట కాలువల్లో పనులు కొనసాగుతోన్నాయి. పాములపర్రు, మొర్రకోడు, ఉండి చానల్, వాండ్రం, చిలకంపాడ వద్ద రావిపాడు చానల్, పరిమళ్ల లీడ్ చానల్, గోకపరం, అర్తమూరు చానళ్లలో పనులు కొనసాగుతోన్నాయి.

వెంకయ్య వయ్యేరులో పనులు నిల్

వెంకయ్య వయ్యేరు పంట కాలువ దిగువ ప్రాంతంలో పూడికతీత పనులకు నిధులు మంజూరు కాలేదు. పరిమళ్ల లాకుల వద్ద నుంచి ఏలూరుపాడు లాకుల వరకూ పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఆకివీడులోని వెంకయ్య వయ్యేరు పంట కాలువపై ఉన్న రైల్వే వంతెన దగ్గర నుంచి ఏలూరుపాడు లాకుల వరకూ గతంలో బెడ్ కాంక్రీట్ పనులు చేపట్టారు. బెడ్ కాంక్రీట్‌పై భారీగా పూడికలు పేరుకుపోయాయి. కొన్ని చోట్ల నాచు, కర్రనాచు, తూడు పేరుకుపోయాయి. బెడ్ కాంక్రీట్‌పై పూడిక పనులు ఈ ఏడాది నిర్వహించే అవకాశాలు కన్పించడం లేదు. వెంకయ్య వయ్యేరు, ఓల్డ్ వయ్యేరు పంట కాలువలకు 12 షట్టర్లు నిర్మించాల్సి ఉంది. గతంలో దొడ్డనపూడి చానల్‌కు షట్టర్ కొట్టుకుపోతే రైతులు పునర్నిర్మాణం చేసుకున్నారు. షట్టర్ల నిర్మాణం కోసం రూ.12 లక్షల మేర అంచనా వేసి పంపినా ప్రస్తుత పనుల్లో మంజూరు కాలేదు. మండలంలోని కోళ్లపర్రు, దొడ్డనపూడి చానల్‌లో పూడికతీత పనుల కోసం అంచనా వేసి పంపినా నిధులు మంజూరు కాలేదు.

తూడు తొలగింపే శరణ్యం

ఈ ఏడాది పలు మీడియం, మైనర్ పంట కాలువల్లో పూడికతీత పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో కేవలం ఆయా కాలువల్లో తూడు తీత పనులకు మాత్రమే అనుమతులు మంజూరయ్యాయి. నీటి సంఘాల ద్వారా ఆయా పనులు చేపట్టాల్సి ఉంది.

నోళ్లు, నారుమళ్లు ఎండాల్సిందేనా?

పంట కాలువలకు నీటి విడుదల ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో నారుమళ్లకు తీవ్ర జాప్యం జరగనుంది. గ్రామాల్లోని మంచినీటి చెరువులను నింపుకోవలసి ఉంది. జూన్ 15 నాటికి కాలువలు వదిలితే కాలువల్లోని మురుగు, చెరువుల్లోని పసరు నీరు బయటకు పోయేందుకు వారం, పది రోజులు పట్టే అవకాశం ఉంది. దీంతో జూలై మొదటి వారం వరకూ ఆ నీటిని వాడుకునే అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో మంచినీటి చెరువుల్లోకి నీరు ఎప్పుడు నింపుకుంటారు. నారుమళ్లకు నీరు ఎప్పుడు అందుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించడానికి మంగళవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు చినరంగనిపాలెం, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, ప్రకృతి ఆశ్రమం, కలెక్టరేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

దాడి కేసు నమోదు

భీమవరం: డబ్బులిస్తే సోడా ఇస్తాననడంతో సోడా షాపు యజమానిపై దాడి చేసి రూ.2 వేలు నగదు తీసుకుపోయిన వ్యక్తి ఉదంతమిది. ఈ కేసుకు సంబంధించి భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చినరంగనిపాలెంలో సామన వీరవెంకట సత్యనారాయణ సోడాబడ్డీ పెట్టుకుని జీవిస్తున్నాడు. బేతనిపేటలోని ఒక షాపులో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూయాదవ్ వచ్చి సోడా అడిగాడు. డబ్బులిస్తే ఇస్తాననడంతో సత్యనారాయణపై దాడి చేసి ముఖం, చేతులపై గాయపరిచాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణాజీ చెప్పారు.

తండ్రిపై తనయుడి దాడి

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామం గోపుచెరువు ప్రాంతానికి నికి చెందిన బాలం జోసఫ్ అనే వ్యక్తి ఇంట్లో అతడి మనుమడు ఈ నెల 22వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఆడుకుంటూ అల్లరి చేస్తున్నాడు. దీంతో జోసఫ్ తన మనవడిని అల్లరి చేయొద్దని మందలించాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి కుమారుడు ఇస్సాకు తండ్రిపై వెదురు బొంగుతో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన జోసఫ్‌ను ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు.

లైబ్రరీలో ఇంద్రజాల ప్రదర్శన

నరసాపురం: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శకుడి టి.వెంకటేశ్వరరావు తన ఇంద్రజాల ప్రదర్శనతో విద్యార్థులను అలరించారు. పిల్లలకు నీతి కథలు చెప్పారు. బీజీబీఎస్ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.అమ్మాజీ, లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక అలంకరణ



మల్లెపూల అలంకరణలో అమ్మవారు

భీమవరం(ప్రకాశంచౌక్): అమావాస్య సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి మల్లెపూలతో పూజ చేసి అలంకరణ చేశారు. సోమవారం పట్టణానికి చెందిన చిట్టూరి జగదీశ్, ఈశ్వర్, జక్కంశెట్టి రుత్విక్‌లచే ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు

భీమవరం అర్బన్: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి వారిని సోమవారం ఘనంగా ఊరేగించారు. డప్పు, వాయిద్యాలతోనూ, బాణసంచాతోనూ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేసవి సెలవుల్లో యోగా శిక్షణ



గ్రంథాలయంలో యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఆకివీడు: విద్యార్థులు చదువుతో పాటు నిత్యం యోగాలో శిక్షణ పొందాలని యోగాసన ఆచార్యులు యు.సాంబశివరావు సూచించారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణలో భాగంగా యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతుందన్నారు. చిన్నప్పటి నుంచే యోగాలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి విద్యాబుద్ధులతో మేధా సంపత్తిని పొందుతారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం అధ్యక్షుడు డి.సత్యనారాయణ, కిషోర్, గ్రంథ పాలకురాలు పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీ ప్లస్ వన్ ఇళ్లతో ఇక్కట్లు

యలమంచిలి: పాలకొల్లు రామయ్యహాలు వద్ద ప్రభుత్వం జీ ప్లస్ వన్ పేరుతో ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల లబ్ధిదారులు మధ్య గొడవలకు దారి తీస్తుందని సీపీఎం పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు విమర్శించారు. ఈ పద్ధతిలో కింద ఒకరు పైన ఒకరు ఇళ్లు కట్టుకోవడం వల్ల ఇరువురి మధ్య డ్రెయినేజ్, తాగునీరు, కింద శుభ్రపరిచే విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయని వివరించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించకుండా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. సమస్యలు వచ్చేలా పట్టాలిచ్చిన అధికారులు పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. చిన్న చిన్నగా ఉన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో తీవ్రమవుతాయని ఆయన హెచ్చరించారు. జీ ప్లస్ వన్ ఇళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట లబ్ధిదారులు తానింకి లక్ష్మీ కుమారి, దిగమర్తి ప్రమీల, రామిశెట్టి పద్మ, దేవిరెడ్డి చంద్రమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సిబ్బంది వినతి

నరసాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని నరసాపురం పట్టణ పరిధిలోని వార్డు సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ ఎం అంజయ్యలను కలిసి వినతపత్రం అందజేశారు. రేషనలైజేషన్‌లో భాగంగా కొరత ఉన్న సిబ్బందిని భర్తీ చేయాలని, సచివాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు మెరుగుపరచాలని, పాడైన కంప్యూటర్లకు మరమ్మతులు చేయించాలని, ఇంటర్నెట్ సదుపాయానికి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసఫ్ కిషోర్, మండల అధ్యక్షుడు పి.మదన్మోహన్, ఉద్యోగులు ఉదయ్‌కుమార్, అడపా సత్యనారాయణ, డి.కృష్ణ, జి.గోపాల కృష్ణ, ఎస్ అశోక్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, పండ్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

ఆకివీడు: మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక దత్త క్షేత్రం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో చేపల చెరువులకు ఊరట



కొత్తపూసలమర్రు గ్రామంలో సాగు చేస్తున్న చేపల చెరువు

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాల వలన చేపల చెరువులు ఊపిరి పోసుకున్నాయి. భీమవరం మండలంలో నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, దిరుసుమర్రు, దొంగపిండి, గొల్లవానితిప్ప, గూట్లపాడు, వెంప, పెదగరువు, తుందుర్రు, కొమరాడ, అనాకోడేరు తదితర గ్రామాల్లో సుమారు 14 వేల ఎకరాల్లో చేపల చెరువులు చేస్తున్నారు. వేసవిలో కారణంగా ప్రతి ఏటా ఏప్రిల్ శివారులో పంట కాలువలు కట్టేస్తారు. మే నెలలో వేసవితాపానికి చేపల చెరువుల్లో నీళ్లు ఇంకిపోవడంతో ఉప్పు శాతం పెరిగిపోవడం, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కబోతతో చెరువుల్లో పీహెచ్, అమ్మోనియా, ఆక్సిజన్, నైట్రేట్ నీటి పరమాణువుల్లో హెచ్చుతగ్గులు వచ్చి ఒకేసారి మృత్యువాత పడేవి. దీంతో చేపలను అయినకాడికి అమ్ముకొని తీవ్ర నష్టాలను చవి చూసేవారు. ఈ ఏడాది అల్పపీడన ద్రోణి కారణంగా వర్షాలు పడటం చేపల చెరువుల్లో వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు లేవని ఆక్వా రైతులు చెబుతున్నారు. అయితే వర్షాలు, మబ్బుల కారణంగా చేపలు మేతలు తినకుండా మందగిస్తున్నాయని ఈ ప్రభావం చేప దిగుబడిపై చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ వసతి గృహాలపై అవగాహన కల్పించాలి



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

భీమవరం: ఆచంట నియోజవర్గంలో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలు ప్రారంభించిన ప్రభుత్వం విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విమర్శించారు. వసతి గృహాలను సక్రమంగా నిర్వహించాలని సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్పరాజ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనేక మంది వసతి గృహాల మీద ఆధారపడి చదువుకుంటున్నారని వాటిల్లో సరియైన వసతులు లేక నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు వసతి గృహాల్లో ఉంటూ చదువుకునేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, పెట్ట వినోద్‌కుమార్, ఈది ప్రవీణ్, జొన్నల వజ్రం, కుసుమే వెంకటేశ్వరరావు, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సంరక్షణ



యోగాభ్యాసన శిక్షణలో పాల్గొన్న సాధకులు

భీమవరం: ఆరోగ్య సంరక్షణకు యోగా ఎంతగానో దోహదం చేస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఆయుష్‌శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన యోగా అభ్యాసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగాతో మానసిక ఒత్తిడి తగ్గించుకుని ప్రశాంతమైన జీవితం సాగించొచ్చని జూన్ 21వ తేదీ వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించి యోగాంధ్ర వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకునే విధంగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం యోగా శిక్షకుడు బి.చంద్రశేఖర్ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయడం వలన ఏ విధంగా ఆరోగ్యంగా జీవించవచ్చో వివరిస్తూ అభ్యాసకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ హరిశ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, పలు శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కూటమి విఫలం



ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

భీమవరం: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీతోపాటు సూపర్ సిక్స్ హామీలు తక్షణం అమలు కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదిన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం భీమవరం సీపీఐ కార్యాలయంలో ధర్నా వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇప్పటికే ఇళ్లు లేని నిరుపేదలతో ఇళ్ల స్థలాల కోసం లెక్టరేట్, సచివాలయాల్లో దరఖాస్తులు, పేదలు వ్యక్తిగత అర్జీలు ఇచ్చినట్లు చెప్పారు. జూన్ 2వ తేదీన ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులతో నిర్వహించే ధర్నాలో అర్జీదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోనాల కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్‌ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవీ ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, నాగిడి శాంతమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు మూడు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ఆకివీడు: పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరు కావాలని, క్రమ పద్ధతిలో అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, అమలుకు చర్యలు చేపట్టాలని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆయన హాజరయ్యారు. ఆయన సమక్షంలో మూడు ఫిర్యాదులు వచ్చాయి. గత కొంత కాలంగా వస్తున్న ఫిర్యాదులే పరిష్కారం కాకపోవడంతో మరలా తీసుకొచ్చారు. మండలంలోని రాజులపేటలో ఓల్డ్ వయ్యేరు పంట కాలువ నుంచి అక్రమంగా నీటిని చేపల చెరువులకు తోడుతున్నారని, రొయ్యల చెరువుల్లోని నీటిని పంట కాలువలోకి వదిలి వేస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన గొట్టుముక్కల వెంకట సూర్య సత్యనారాయణరాజు ఫిర్యాదు చేశారు. ఓల్డ్‌వయ్యేరుపై అనుమతులు లేని తూములు, వంతెనలను తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మాదివాడలోని సర్వే నంబర్ 285–4బీలో 72 సెంట్ల భూమిని మండల సర్వేయర్‌తో సర్వే చేయించాలని ఎండీ నిజాముద్దీన్ బాబా ఫిర్యాదు చేశారు. మండలంలోని దుంపగడపలో మంచినీటి చెరువుకు ఆనుకొని ఉన్న రొయ్యల చెరువుకు అనుమతులు రద్దు చేయాలని, చెరువుల్లోని ఊట నీరు మంచినీటి చెరువులోకి వస్తుందని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు.

దళిత యువకులపై దాడి అమానుషం



నన్నేటి పుష్పరాజ్

భీమవరం: తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై దళిత యువకులపై దాడి చేసిన సీఐలు రాములునాయక్, రమేష్‌బాబుపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. తెనాలి పట్టణంలో దళిత యువకులపై జరిగిన దాడి అమానుషమని పుష్పరాజ్ భీమవరంలో పేర్కొన్నారు. దళిత యువకులను పోలీసులు దారుణంగా బూతులు తిడుతూ కొట్టారన్నారు. ఈ సంఘటన చూస్తే చాలా బాధ కలిగిందన్నారు. దళితులే కదా ఎవరూ అడగరని పోలీసులు గూండాల్లా ప్రవర్తించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు దాడికి పాల్పడిన పోలీసులపై కేసులు నమోదు చేసి, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులపై చట్టపర చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమం చేయటానికి ఏమాత్రం వెనకబాడబోమని పుష్పరాజ్ హెచ్చరించారు.

ఉగ్రవాదులను సమూలంగా తుదముట్టించాలి


భీమవరం (ప్రకాశంచౌక్): పాకిస్తాన్ కుట్రలు, కుతంత్రాలు మనలను ఏం చేయలేవని, ఉగ్రవాదులు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారిని తుదముట్టించాలన్నదే కేంద్రం సంకల్పమని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం కొత్త బస్టాండ్ నుంచి పోలీస్ బొమ్మ సెంటర్ వరకు సోమవారం జయహో భారత్ ర్యాలీ నిర్వహించారు. స్నేహ, చైతన్య ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నంశెట్టి శ్రీనివాస్, కడలి హరిబాబు మాట్లాడుతూ ఆడబిడ్డల కుంకుమ చెరిపిన వాళ్లు భూమి మీద ఉండకూడదనే కేంద్రం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిందని, ఉగ్రవాదంపై పోరాడుతున్న ఏకైక నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని, ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్‌కు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అన్ని రంగాల వారితో పాటు కార్మికులు ప్రధాని మోడీకి అభినందనలు తెలుపుతూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, ఎం.సీతారామ్‌ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శిథిల వంతెనలు.. బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

- గోస్తనీ కాలువపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనలు
- పునర్నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు



బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన బ్రిటిష్‌కాలం నాటి వంతెన



బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన 1958లో నిర్మించిన వంతెన

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో గోస్తని పంట కాలువపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెను ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిపై రాకపోకలకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీటి మరమ్మతులను ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంతో రాకపోకలకు స్థానికులు, ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది.

జగన్ హయాంలోనే అభివృద్ధి

ఇటీవల ఉప్పర కాలనీకి చెందిన సిర్రాపు దుర్గ అనే మహిళ బ్రిటిష్ కాలం నాటి వంతెన రంధ్రాల నుంచి కాలువలో పడి మృతిచెందినట్టు తెలిసింది. 1858లో నిర్మించిన బ్రిటిష్ వంతెన శిథిలావస్థకు చేరడంతో 1958లో మరో వంతెన నిర్మించారు. అనంతరం బ్రిటిష్‌కాలం నాటి వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పాత వంతెనకు ఆనుకుని గోస్తని కెనాల్ గట్టున ఒక ప్రైవేటు ఆసుపత్రి ఉండటం, ఆప్రాంత రైతుల ప్రయోజనాల కోసం ఆసుపత్రికి వెళ్లే రోగుల అవసరాల నిమిత్తం అప్పట్లో పాత వంతెనను అధికారులు తొలగించకుండా వదిలేశారు. ఈ వంతెనకు పడమర వైపు ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ పోరంబోకు స్థలాల్లో కొందరు ఉప్పర్లు గృహాలు నిర్మించుకుని సుమారు 30 కుటుంబాలు ఉప్పర కాలనీలో నివసిస్తున్నారు. కొత్త వంతెనకు పక్కనుంచే మెయిన్ రోడ్డుకు జగనన్న ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు నిర్మించారు. అయితే ఈ కాలనీవాసులంతా తమ అవసరాల కోసం బ్రాహ్మణచెర్వు సెంటర్‌కు రావాలంటే దగ్గరగా ఉండే వంతెన శిథిలావస్థకు చేరింది. పాత వంతెనపై ప్రమాదాలకు కారణం అవుతున్న రంధ్రాలను మూయించడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. 1958లో నిర్మించిన వంతెన రెయిలింగ్ కూలిపోయి పిల్లర్లు బీటలు వారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ఇరుకు వంతెనలను విస్తరించాలి

మాముడూరు వద్ద గోస్తని డ్రెయిన్‌పై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు ఎప్పుడు బంద్ అవుతాయో తెలియక ఆ గ్రామస్తులు వచ్చిన ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ప్రయోజనం చేకూరలేదు. పెనుమంట్ర మండలంలో మార్టేరు నుంచి నత్తారామేశ్వరం వరకు స్టేట్‌హైవే రోడ్డు పొడవునా ఉన్న గోస్తని, గొంతేరు, భగ్గేశ్వరం, డ్రెయిన్లకు ఉన్న వంతెనలు ఇరుకుగా ఉండటంతో రైతుల పొలాలు ముంపుబారిన పడుతున్నాయని వాటిని విస్తరించాలని కోరుతున్నారు.

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు

మాముడూరులో గోస్తనీ డ్రెయిన్‌పై ఉన్న వంతెన పునర్నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో ఉన్న వంతెనల సమస్యలపై పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపి, తదుపరి చర్యలు చేపతాం.

– యశ్వంత్, ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ, పెనుమంట్ర